క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా సోమవారం మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజబోల్లారం తండాలలో అగ్రికల్చర్, డోమస్టిక్, పారిశ్రామిక సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

కీసర సబ్‌స్టేషన్ పరిధిలో...

కీసర: మరమ్మతుల కారణంగా కీసర సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం కీసర, కీసరదాయర అగ్రికల్చర్‌కు, చీర్యాల జేఎన్ఎంయూఆర్‌కాలనీ, చీర్యాల ఎన్‌జీఆర్‌కాలనీ, బండ్లగూడ, హరిదాస్‌పల్లి, వీఆర్‌ఆర్ హోమ్స్, ఠాకూర్‌కాలనీ, మోడీ అపార్ట్‌మెంట్, సింధువనం, శ్రీరామ్‌నగర్, ఆర్‌జీకే కాలనీ, పల్లవి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ అనిల్ తెలిపారు.

పార్కింగ్‌కు టెండర్ల ఆహ్వానం

కీసర: మహాశివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ జాతర సందర్భంగా వాహనాల పార్కింగ్ వేలం పాటకు దరఖాస్తులు ఔత్సాహికుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు క్రీసర గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు www.tender.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, సోమవారం ఉదయం నుంచి సైట్ అందుబాటులో ఉంటుందన్నారు.

నేటి నుంచి 'హాత్ సే హాత్ జోడో' యాత్ర


హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న 'హాత్ సే హాత్ జోడో' యాత్రను మేడ్చల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్, పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న యాత్రకు సంఘీభావంగా నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీల కాంగ్రెస్ శ్రేణులంతా కలిసి యాత్ర నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. లక్ష కుటుంబాలను ప్రత్యక్షంగా కలవాలే లక్ష్యంతో రేవంత్ రెడ్డి ఈ యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కరపత్రాల్లో ముద్రించి పంపిణీ చేస్తామన్నారు. మేడ్చల్‌లో నిర్వహించే యాత్రను గౌడవెల్లి శివాలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి నుంచి అత్వెల్లి శివాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రారంభోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం పార్వతి రాజరాజేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, మంగళవారం విగ్రహాల ఊరేగింపు, బుధవారం గణపతి హోమం, స్థాపిత దేవత హోమాలు, జలాధి వాసము, బుధవారం చండీ హోమం, రుద్రహోమం, మన్యుసూక్త నవగ్రహ హోమాలు, గురువారం గర్త న్యాసము, ధాతు న్యాసము, బీజ న్యాసము, యంత్ర, మూర్తి, శిఖర, ధ్వజ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా అత్వెల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నీడ లేకుండా బండలపై వెలసి ఉన్న శివలింగకు కౌన్సిలర్ సరితా మల్లేష్‌గౌడ్ గ్రామస్థుల సహకారంతో లక్షల రూపాయలు వెచ్చించి సంపూర్ణ కృష్ణ శిలతో ఆలయాన్ని నిర్మించడం విశేషం.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న అందె నరేందర్

జవహర్‌నగర్: దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) జవహర్‌నగర్ అధ్యక్షుడిగా అందె నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జవహర్‌నగర్‌లో డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని నరేందర్ అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, పద్మారావు ముదిరాజ్, అవినాష్, రాథోడ్, నాగేష్, అర్జున్, సమ్మిరెడ్డి, కుమార్, ఉపేందర్, సాయి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులపై ఆశలెన్నో..!



నేటి బడ్జెట్ ప్రకటనపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజల ఎదురుచూపు

- నిధుల లేమితో నిలిచిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు
- సగం మందికి అందని 'ఆసరా'
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందని ఉపాధి రుణాలు
- రైతు రుణ మాఫీ అంతంతే..
- అస్తవ్యస్తంగా పురపాలక సంఘాలు, జీపీల్లో అంతర్గత, ప్రధాన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ

సాక్షి,మేడ్చల్ జిల్లా: శాసనసభలో ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. బడ్జెట్ ఎలా ఉంటుందనే దానిపై వారు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రానున్నది ఎన్నికల ఏడాది కావడంతో మూడేళ్లుగా బీసీలకు అందని స్వయం ఉపాధి నిధులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కూడా అత్యధికంగా స్వయం ఉపాధి నిధులు రాగలవని ఆశిస్తున్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు...

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు 2,350 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు 680 మాత్రమే పూర్తయ్యాయి. మిగతా ఇళ్ల నిర్మాణం వేగవంతానికి అదనంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.

సమీకృత మార్కెట్లు...

- జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో 13 సమీకృత మార్కెట్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. వీటి నిర్మాణానికి రూ.39.90 కోట్లు అవసరం కాగా, కొన్ని నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా నిధులు రావాల్సి ఉంది.

మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తం...


- జిల్లాలోని పురపాలక సంఘాలు, పంచాయతీల్లో ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వీటి మరమ్మతులు, కొత్త వాటి నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాల్సి ఉంది.

రైతు ప్రాధాన్యత కోసం ఎదురు చూపులు..

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మొత్తంలో రుణ మాఫీ పూర్తిగా చేయాలంటే ప్రభుత్వం అదనపు నిధులు విడుదల చేయాల్సింది. కొన్నేళ్లుగా నిధులు లేకపోవడంతో.. జిల్లాలో రూ.25 వేల లోపు రుణం తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తోంది. దీంతో మరో 10 వేల మంది రైతులు రుణ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 13,600 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఆరు నెలలకు ఒకసారి 44,792 మంది రైతులకు రూ.39.74 కోట్లు అందిస్తున్నా.. ధరలు లేక దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో 17,473 మందికి రైతు బీమా అందించాల్సి ఉండగా, నిధుల లేమితో 23 మంది రైతు కుటుంబాలకు మాత్రమే అందజేశారు. పంట బీమాతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తే గాని.. రైతులకు కొంత మేలు జరిగే అవకాశం ఉంది. జిల్లాలో కేశ్వాపూర్ జలాశయం వంటి ప్రాజెక్టులు ప్రతిపాదనలో ఉన్నా.. నిధుల లేమితో అసంపూర్తిగా ఉన్నాయి.

అనుబంధ రంగాలకు ప్రాధాన్యం..

- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రతీ ఏటా 10 వేల ఎకరాల్లో మూడేళ్ల పాటు ఉద్యానవన పంట సాగు పెంపు ద్వారా రూ.450 కోట్ల వ్యయంతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చేయాలన్న సీఎం కేసీఆర్ హామీకి నిధుల లేమితో తూట్లు పడుతోంది. ఈ బడ్జెట్‌లో అయినా నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.
- పాడి పరిశ్రమలతో పాటు వ్యవసాయ పంట ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటుకు కూడా నిధులు కేటాయించి ప్రోత్సహిస్తే అన్నదాతలకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.
- రెండో విడత గొర్రెల పంపిణీ కోసం రైతు తమ వాటా కింద ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. ఈ బడ్జెట్లో నిధులు కేటాయిస్తే పెండింగ్‌లో ఉన్న 229 యూనిట్ల గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.
- జిల్లాలో 51 మత్స్యకార సంఘాలు చేపల విక్రయాలపై ఆధారపడుతున్నారు. ఉచిత చేపలు, రొయ్యల విడుదలకు నిధులు కేటాయిస్తే పథకం సజావుగా జరగటంతో పాటు 2,675 మంది మత్స్యకారుల కుటుంబాలకు మేలు జరగనుంది.



'మన ఊరు–మన బడి'కి...

'మన ఊరు–మన బడి' పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు సమకూర్చేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లాలో తొలి విడత 76 బడులను ఎంపిక చేసింది. ఇందులో 25 పాఠశాలలకు నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు పూర్తి చేసి ఫిబ్రవరి 1న ప్రారంభించారు. మిగిలిన పాఠశాలల్లో ప్రతిపాదించిన పనులు పూర్తి చేయాలంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.60 కోట్లు అవసరం.

వైద్య సౌకర్యాల మెరుగుకు...

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందాలంటే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుతో పాటు 50 పడకలు ఉన్న ఘట్‌కేసర్, మేడ్చల్ సీహెచ్‌సీలను 100 పడకలను పెంచాల్సి ఉంది. శామీర్‌పేట, మల్కాజిగిరి పీహెచ్‌సీలను 50 పడకలకు పెంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు అభివృద్ధి చేయటానికి కావలసిన నిధులను మంజూరు చేయడంతో సరిపడా వైద్యులు, సిబ్బంది, సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి వినతి


రైల్వే మంత్రికి వినతి పత్రం ఇస్తున్న విక్రంరెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల రైల్వే స్టేషన్ సమీపంలో అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డిలు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ రైల్వే స్టేషన్‌కు ఒక వైపు కేవీ రెడ్డినగర్, ఆంథెమ్ విల్లాస్ తదితర కాలనీలు, మరోవైపు ఉండటంతో ఏ చిన్న పనికైనా 10 కిలోమీటర్ల చుట్టూ ప్రయాణించాల్సి వస్తోందని సమస్యను మంత్రికి వివరించారు. ప్రజల అవసరార్థం అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రైల్వే మంత్రిని కోరారు.

'మంత్రి మల్లారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు'


సమావేశంలో మాట్లాడుతున్న కొండల్ ముదిరాజ్

జవహర్‌నగర్: మంత్రి మల్లారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని, జవహర్‌నగర్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు బాషబోని కొండల్‌ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ గత రెండు రోజుల క్రితం మంత్రి మల్లారెడ్డిపై చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా ఆదివారం డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, టీఆర్ఎస్ కమిటీ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండల్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో మంత్రి మల్లారెడ్డి ఇప్పటికే రూ.75 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని, తెలంగాణలో వారి ఉనికిని కోల్పోతున్నారని భావించి బీఆర్ఎస్‌తో పాటు మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిలపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బంగడుపుతున్నారన్నారు. మరోమారు మంత్రి మల్లారెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా ఇన్‌చార్జి అహ్మద్‌పాషా, కార్పొరేటర్ గొడుగు వేణుముదిరాజ్, కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, నాయకులు జిట్ట శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ మహేష్, ప్రకాశ్, ఆరూరి నర్సింహ, ప్రసాద్‌గౌడ్, మాధవరెడ్డి, పాల్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం



జవహర్‌నగర్: ఓ నిండు గర్భిణిని 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేఆర్‌నగర్‌కు చెందిన తాసీమ్ బేగం నిండు గర్భిణి. ఆమెను ప్రసవం కోసం ఆదివారం సాయంత్రం 108లో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా చెన్నాపురం వద్ద ప్రసవించి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ కైలాష్, పైలట్ శంకరయ్యలు తెలిపారు. తదుపరి వైద్య పరీక్షలు నిమిత్తం జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్..

చేపల వేటకు వెళ్లి వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ఎండీ సబర్, దాసరి బాలరాజు మృతదేహం

మేడ్చల్‌రూరల్: చేపల వేటకు ఇంటి నుంచి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు వేర్వేరు చెరువుల్లో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృత్యువాత పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం... మేడ్చల్ పట్టణంలోకి కిందిబస్తీకి చెందిన దాసరి బాలరాజు(40) శనివారం సాయంత్రం సమయంలో చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు మేడ్చల్ పెద్ద చెరువు వద్ద వెతకగా బాలరాజు బైక్ కనిపించింది. దీంతో చేపల పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి ఉండవచ్చని గాలించగా ఆదివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి చేపల వల చుట్టుకుపోయి ఉండడంతో ప్రమాదవశాత్తు నీటిలో పడ్డ బాలరాజు వలకు చిక్కుకుని మృత్యువాత పడి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

చేపలు పట్టే కర్ర లాగితే బయటకి...

మేడ్చల్ పట్టణంలోని బ్యాంక్ కాలనీలో నివాసం ఉండే ఎండీ సబర్(42) వృత్తి రీత్యా పెయింటర్. శనివారం సాయంత్రం ఎర్ర చెరువులో చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లిగా రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చెరువు వద్ద గాలించారు. చెరువు నీటిలో చేపలకు గాలం వేసే కర్ర కనిపించడంతో సబర్ సోదరుడు ఆ కర్రను బయటికి లాగగా కర్రతో పాటు మృతదేహం బయటికి వచ్చింది. దీంతో ఒక్కసారిగా కుటుంబీకులు ఉలిక్కిపడ్డారు. కాగా మూర్చ వ్యాధితో బాధపడే సబర్‌కు చేపలు పట్టే సమయంలో మూర్చ వచ్చి ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించి ఉండవచ్చని కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

మేడ్చల్‌లో రెచ్చిపోయిన దొంగలు

వరుసగా ఐదు ఇళ్లలో చోరీ

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని ఇళ్లలో చోరీలకు పాల్పడే ముఠా శనివారం రాత్రి రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్ పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో అర్ధరాత్రి వరుసగా ఐదు ఇళ్లలో చోరీలకు పాల్పడి అందినంత సొత్తు దోచుకెళ్లారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో రెండు ఇళ్లలో నివాసం ఉంటున్న బ్యాచిలర్స్, మరో ఇంట్లో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం అద్దెకు ఉంటున్నారు. మూడు ఇళ్లలో ఎవ్వరూ లేకపోవడంతో దొంగలు ఇళ్లలో చొరబడి దొంగతనాలకు పాల్పడ్డారు. రెండు ఇళ్లలో బ్యాచిలర్స్ ఉంటుండటంతో ఏమీ దొరకలేదు. మరో ఇంట్లో రెండు బంగారు ఉంగరాలు అపహరించుకెళ్లారు. కాగా మూడు ఇళ్లలో చోరీకి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విందుకు వెళ్లొచ్చే సరికి ఇళ్లు గుల్ల...

అత్తగారింట్లో విందుకు(ఫంక్షన్)కు వెళ్లొచ్చే సరికి దుండగులు ఇళ్లుగుల్ల చేశారు. శ్రీనివాసనగర్ కాలనీలో నివాసం ఉండే రాపోలు రాజు కుటుంబం శనివారం రాత్రి సాయంత్రం 9 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి మండలంలోని మునీరాబాద్‌కు గ్రామానికి ఫంక్షన్ వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం 5 గంటలకు ఇంటికి చేరుకోగా ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న 2 తులాల బంగారం 20 వెండి ఆభరణాలు, రూ.9 వేల నగదు దోచుకెళ్లారు. అదే భవనంలో పై అంతస్తులో అద్దెకు ఉండే ఉపేందర్ గత రెండు రోజుల క్రితం ఊరెళ్లగా వారి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు 4 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. దొంగలు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడే సమయంలో వాటి పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఇంట్లోనే నిద్రిస్తున్నట్లు తెలుసుకున్న దొంగలు ఆ రెండు ఇళ్లకు బయటి నుంచి గడి పెట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనాల విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు, క్లూస్ టీం చోరీలకు గురైన ఇళ్లలో పలు ఆధారాలు సేకరించారు. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యాచకుడి మృతదేహం లభ్యం



ఘట్‌కేసర్: గుర్తుతెలియని యాచకుడి మృతదేహం ఆదివారం లభ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ప్రకారం... అన్నోజీగూడ బస్టాప్‌లో సుమారు 40 ఏళ్లు గల గుర్తుతెలియని వ్యక్తి స్పృహ లేకుండా పడి ఉన్నాడని వందకు కాల్ రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. వెంటనే వారు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించిగా అప్పటికే అతడు మరణించాడని ప్రకటించారు. అతడి కుడి చేతిపై సూర్యుడిని తలపించేలా టాటూ వేసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాన్నట్లు తెలిపారు.

ప్లాటు హద్దు రాళ్లను తొలగించిన వ్యక్తులపై కేసు

ఘట్‌కేసర్: ప్లాటు సరిహద్దు రాళ్లను తొలగించిన వ్యక్తులపై ఘట్‌కేసర్ పీఎస్‌లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాలు ప్రకారం... పీర్జాదిగూడ శంకర్‌నగర్‌కాలనీకి చెందిన రాచమల్ల బాల్‌రెడ్డి కొండాపూర్ సర్వే నంబర్.65, 66లోని శ్రీనిధి హోమ్స్ వెంచర్‌లో ప్లాటు నంబర్ 1279ను (200 గజాలు) 2018లో కొనుగోలు చేశాడు. కాగా గత నెల 29న కొందరు వ్యక్తులు జేసీబీ సాయంతో ఆయన ప్లాటులోకి అక్రమంగా ప్రవేశించి హద్దు రాళ్లను తొలగించి చదును చేయించారు. ఎందుకు చేశారని ప్రశ్నించగా భూమి మాదంటూ సమాధానమిచ్చారు. అనంతరం విచారించగా కొండాపూర్‌కు చెందిన దాసరి బాల్‌రెడ్డి, అతడి కుమారుడు దాసరి మల్లారెడ్డిగా తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి తనవంతు సహాయ, సహకారాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గండి అంజయ్యగౌడ్, ఎల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


లబ్ధిదారుడికి ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని సత్యసాయినగర్ కాలనీకి చెందిన కృష్ణాచారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదివారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

'విద్యతోనే సమాజంలో మార్పు'


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

జవహర్‌నగర్: విద్యతోనే సమాజంలో మార్పు వస్తోందని, ప్రస్తుత ప్రపంచీకరణలో ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించాలని సేవారత్న అవార్డు గ్రహీత అరకల అనిల్‌కుమార్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం కార్పొరేషన్‌లోని గబ్బిలాలపేటలో పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని, సేవ చేయడంలోనే ఆనందం ఉంటుందన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని కోరారు. రాబోయే రోజుల్లో నిరుపేదల కాలనీల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు రొయ్యల క్రిష్ణమూర్తి, ఆంజనేయులు, తిరుపతి, నర్సింహ, రాములు, సత్యనారాయణ, కరుణాకర్, శ్రీను, శివ, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కీసర: భోగారం గ్రామం నిమ్మకాయలగూడెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ సుంకరి కవితా జైహింద్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ జానకీరాం, మాజీ ఉపసర్పంచ్‌లు చెప్యాల వెంకట్రామిరెడ్డి, గన్నోర్ల సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు. కాగా భోగారం గ్రామానికి చెందిన పవన్ కిరాణ దుకాణ యాజమాన్యం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బహుజనుల్లో వెలుగులు నింపిన మహనీయుడు అంబేడ్కర్

ఘట్‌కేసర్: బహుజన వర్గాల్లో వెలుగులు నింపిన అంబేడ్కర్ మహనీయుడని బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్ గొంగళ్ల బాలేశ్ మహేశ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, ఆంజనేయులు, నర్సింహ, బాలయ్య, రాములు, రాజేశ్, జంగయ్య, సంతోశ్‌కుమార్, మైపాల్, రూపేశ్‌కుమార్, నవీన్‌కుమార్, చందు, గణేశ్, అఖిల్, అనుశ్, విష్ణువర్ధన్, నితిన్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్: కొర్రెముల్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కేలండర్‌ను ముఖ్య అతిథిగా ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జయచంద్ర హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియర్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, ఈశ్వర్, అశోక్, గణేశ్, మల్లేశ్, బిక్షపతి, శివ, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపాధికి రాజమాత ఫౌండేషన్ చేయూత


రాజమాత ఫౌండేషన్ ఆర్థిక సాయంతో ప్రారంభమైన షాపు

పోచారం: దివ్యాంగులకు జీవనోపాధి కల్పించేందుకు శ్రీరాజమాత ఫౌండేషన్ చేయూతను అందిస్తోందని ఆ సంస్థ అధ్యక్షుడు ఉదయ్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీకి చెందిన జాన్‌కి ఆర్థిక సాయం అందజేసి అతడిచే చిరు వ్యాపారాన్ని ఏర్పాటు చేయించి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు అంజలి, ప్రీతి, శృతి, పండు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థలాల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం


ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్ ఆపిన స్థలాల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టి వంటవార్పు, ధర్నా కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు నుంచి బోడుప్పల్ వాసుల స్థలాలను కాపాడాలని కోరారు. 40 ఏళ్ల క్రితం చేసిన లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, అలాంటి స్థలాల్లో 2018లో వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలాలుగా ప్రకటించి రిజిస్ట్రేషన్, ఇంటి అనుమతులు నిలుపుదల చేయడం దారుణమన్నారు. ఆస్తులు మావే హక్కులు మావే, కేటీఆర్ మామా.. మా అమ్మ నాన్నాల బాధ వినవయ్యా అంటూ చిన్నారులు ప్లే కార్డులు పట్టుకుని కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నేతలు కొత్త కిశోర్‌గౌడ్, గోనె శ్రీనివాస్ పాల్గొన్నారు.